

పాలకొండ సబ్ కలెక్టర్‌గా యశ్వంత్ రెడ్డి

ప్రజాశక్తి - పాలకొండ



పాలకొండ సబ్ కలెక్టర్‌గా సి.యశ్వంత్ రెడ్డి నియమితులయ్యారు. 2022 బాచ్‌కు చెందిన ఈయనకు ఇక్కడ పోస్టింగ్ లభించింది. గతంలో ఐఎఎస్ అధికారి నూరల్ కమర్ ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పని చేశారు. అనంతరం నాన్ ఐఎఎస్‌లు ఆర్‌డిఒలుగా కొనసాగారు. ఇక్కడ ఆర్‌డిఒగా పని చేసిన వివి రమణ బదిలీ అయ్యారు. అయితే ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

పిచ్చుకులపై బ్రహ్మాస్త్రాలా?

- అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లు
- కెజిబివిల్లో చిరుద్యోగుల తొలగింపు
- ఫీల్డ్ అసిస్టెంట్లపైనా వేధింపులు

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వాలు మారినప్పుడు నిరుద్యోగులపై ప్రతాపం చూపించడం అలవాటుగా మారుతోంది. పిచ్చుకలపై బ్రహ్మాస్త్రంలా అధికారపార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి పెంచి అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగుల తొలగింపు కొనసాగుతోంది. బతుకు తెరువు కోసం చిన్నా చితకా ఉద్యోగాలు చేసుకొనే వారి పొట్టకొట్టడం అధికార పార్టీ నాయకుల ఆధిపత్యానికి పరాకాష్టగా కనిపిస్తోంది. మన్యం జిల్లాలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు కస్తూరిబాయి బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న ఏడుగురు చిరుద్యోగులను తొలగించారు. వీరిలో ఎక్కువ మంది గత ప్రభుత్వం హయాంలో నియమించబడిన వారు కూడా వుండొచ్చు. ప్రభుత్వం ఏదైనా నియామకమైన నిరుద్యోగిని అకారణంగా తొలగించడం వివాదాస్పద మవుతోంది. కేవలం వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి నాయకుల సిఫార్సు మేరకు నియమించారనే సాకు తప్ప మరే ఇతర కారణాలూ లేకుండా జిల్లాలోని కస్తూరీ బాయి బాలికల పాఠశాల్లో తొలగింపు కార్యక్రమం చేపట్టారు. వారి స్థానాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు సిఫార్సు చేసిన వారిని నియమించుకున్నారు. కేవలం రాజకీయ కారణాలతో ఇప్పటి వరకు పని చేస్తున్న వారిని తొలగించి కొత్త వారిని నియమించడం, దీనికి అధికారులు కూడా వంతపాడడంపై సర్వత్రా విమర్శలు వెళ్లువెత్తుతున్నాయి. సాక్ష్యాత్తూ గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఇలాకాలోనూ నలుగురు నిరుద్యోగులపై వేటు పడింది. మంత్రి అనుమతి లేకుండా నియోజకవర్గ పరిధిలో గల కస్తూరీ బాయి బాలికల పాఠశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించరు. ఖాళీగా వున్న ఉద్యోగాల్లో గాని, కొత్త గా మంజూరైన ఉద్యోగాల్లో గాని టిడిపి నాయకుల సిఫార్సు మేరకు నియమించుకుంటే ఎవరూ తప్పు పట్టలేరు. కానీ రెండు, మూడేళ్లుగా పని చేస్తున్న వారిని నోటిమాటతో తొలగించడం పెద్ద చర్చనీయాంశమవుతోంది. పాచిపెంట కస్తూరి బాయి బాలికల పాఠశాలలో పని చేస్తున్న కంప్యూటర్ ఇన్ స్ట్రక్టర్, నైట్ వాచ్ వుమెన్‌లను, మక్కువ కెజిబివిలో పని చేస్తున్న స్వీపర్, కంప్యూటర్ ఇన్ స్ట్రక్టర్‌లను తొలగించారు. ఒక మహిళా మంత్రిగా సాటి మహిళలనే సానుభూతి లేకుండా తొలగించడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. తొలగించిన మహిళా ఉద్యోగుల్లో ఎక్కువ మంది పిల్లలతో ఉన్నవారే కావడం విశేషం. కొమరాడ కెజిబివిలో పని చేస్తున్న డైలీ వేజ్ కుక్, జోగింపేట కెజిబివిలో పని చేస్తున్న కంప్యూటర్ ఇన్ స్ట్రక్టర్, డైలీ వేజ్ కుక్‌లను స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సు మేరకు తొలగించారు. అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్ల కారణంగా నిరుద్యోగుల తొలగింపుపై కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన వారు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేస్తారనే ఆశతో వారు ఎదురు చూస్తున్నారు.



డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు (ఫైల్)

ఫీల్డ్ అసిస్టెంట్లపైనా వేధింపులు

మన్యం జిల్లా లో ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లపైనా రాజకీయ వేధింపులు మొదలయ్యాయి. గత ప్రభుత్వం హయాంలో కొన్ని చోట్ల కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని సాకు చూపి వారిపై వేటు వేయాలనే వ్యూహంతో అధికారపార్టీ నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా పరిశీలిస్తే ఉపాధి హామీ చట్టంలో అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తూ వస్తున్నది అధికారులే. వారిని కాపాడుకుంటూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కింద స్థాయి ఉద్యోగులను బలి చేయాలని చూడడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికే మండలంలోని పెదపదం ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ జరిగింది. అదేదారిలో మరికొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో అధికారపార్టీ నాయకులు వున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

తొలగింపు అన్యాయం

కాంట్రాక్టు, డైలీ వేజ్ పద్దతిలో పని చేస్తున్న చిరుద్యోగులను అకారణంగా తొలగించడం అన్యాయం. కేవలం గత ప్రభుత్వ హయాంలో నియామకమయ్యారనే కారణంతో కెజిబివిల్లో చిరుద్యోగులను తొలగించడం, దీనికి అధికారులు మద్దతుగా నిలబడడం దారుణం. తొలగించినవారిని వెంటనే నియమించాలి.

బివి రమణ, జిల్లా కన్వీనర్, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం.

ఏ తప్పూ చేయలేదు..

2022 ఫిబ్రవరిలో కస్తూరిబా బాలికల పాఠశాలలో నైట్ వాచ్‌వుమెన్‌గా చేరాను. నాకు ఇద్దరు పిల్లలు. ఇదే నా కుటుంబానికి ఆధారంగా భావించాను. నేను ఏ తప్పూ చేయలేదు. నన్ను తొలగించి కొత్త మహిళను నియమించారు.

మంచాల కుమారి, నైట్ వాచ్ వుమెన్,పాచిపెంట.

ప్రాణాలు తీస్తున్న గజరాజులు

ఇప్పటి వరకు 19 మంది మృత్యువాత

వన్నాంలో రైతును తొక్కి చంపిన ఏనుగుల గుంపు

ఒడిశా ప్రాంతం లకేరి అడవులు నుంచి వచ్చిన అడవి ఏనుగుల గుంపు 18 ఏళ్లుగా మన్యం వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే ఏనుగుల దాడిలో మృతుల సంఖ్య 19 మందికి చేరింది. ఇదిలా ఉండగా వేలాది ఎకరాల్లో పంటలను నాశనం చేశాయి. ఈ నేపథ్యంలో ఎనుగుల నుంచి రక్షణ కల్పించాలని జిల్లా వాసులు గగ్గోలు పెడుతున్నా అతీగతీ లేకుండా పోయింది. తాజా కొమరాడ మండలం వన్నాంలో ఏనుగుల దాడిలో ఓ రైతు మృత్యువాత పడ్డాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ప్రజాశక్తి- కొమరాడ

మండలంలోని వన్నాంకు చెందిన వాన శివున్నాయుడు (69) తన కొబ్బరి తోటలో పనిచేస్తుండగా ఒక సారిగా సమీపంలో ఉన్న ఏనుగులు వచ్చి అతనిపై దాడి చేసి తొక్కేశాయి. ఈ ప్రమాదంలో రైతు శివున్నా యుడు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన జరిగిన కాసేపటికి విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని అటవీ శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. అటవీశాఖ, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. శివున్నాయుడు భార్య సోములమ్మ కొంతకాలం క్రితం మృతి చెందింది. పిల్లలు లేకపోవడంతో తన తమ్ముడు కుమారుడు పోలినాయుడును పెంచుకున్నారు.

ఏనుగుల దాడిలో ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 19మందికి చేరుకుంది. ఇప్పటి వరకు ఏనుగులు మన్యం జిల్లాలోకి ప్రవేశించి 18మందిపై దాడి చేయగా వీరంతా మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. వేలాది ఎకరాల్లోని చెరుకు, మొక్కజొన్న, కూరగాయ పంటలు ధ్వంసం కాగా, మరికొన్ని గ్రామాల్లో విద్యుత్ మోటారును కూడా ధ్వంసం చేశాయి. ఇటీవల కురుపాం మండలం జరడ పంచాయతీ గెడ్డగూడకు చెందిన మండంగి చిన్నయ్య ఇంటిని ధ్వంసం చేశారు. అలాగే జియ్యమ్మవలస మండలంలోని కుదమ, చింతలబెలగాం, గవరమ్మపేట తదితర గ్రామాల్లోని వందలాది ఎకరాల్లో పంటను ధ్వంసం చేశాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఏనుగులను తరలించి తమను ఆదుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



ఏనుగుల దాడిలో మృతి చెందిన రైతు శివున్నాయుడు

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ఏనుగుల దాడిలో చనిపోయిన పేద రైతు కుటుంబానికి రూ.25 లక్షల నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. అతను కుటుంబం లేనందున ప్రభుత్వమే దహన సంస్కారాలు చేపట్టాలని కోరారు. కొత్త ప్రభుత్వం వచ్చినా ఏనుగుల దాడిని అరికట్టడంలేదని విమర్శించారు. తక్షణమే ఆపరేషన్ గజాను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలను ప్రత్యేక అధికారులు సందర్శించాలి : కలెక్టర్

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్



ప్రత్యేక అధికారులు పాఠశాలను విధిగా సందర్శించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. జిల్లా విద్యావ్యవస్థలో ప్రమాణాలు గణనీయంగా పెరగాలన్నారు. ఈ మేరకు "మై స్కూల్ మై ప్రైడ్" కార్యక్రమం కింద ఉన్నత పాఠశాలకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండు రోజులు పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. పాఠశాల సందర్శనలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల పుస్తకాల తనిఖీ, పాఠశాల పరిసరాలు, మా బడి మా తోట వంటి కార్యక్రమాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థుల్లో వివిధ సబ్జెక్టుల్లో వారి అవగాహన స్థాయిని పరిశీలించాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు ఏ అంశంలో వెనుకబడి ఉన్నారో పరిశీలించాలని, అందులో వారు మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమగు అన్ని సూచనలు, సలహాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఒక విద్యార్థి ఎందుకు వెనుకబడి ఉన్నాడో కారణాలు స్పష్టంగా గుర్తించాలని, తద్వారా ఆ విద్యార్థి సామర్థ్యాన్ని మెరుగుపర్చి ఆ అంశంలో నిపుణుడయ్యేలా తీర్చిదిద్దాలని అన్నారు. విద్యార్థులు - ఉపాధ్యాయుల మధ్య మంచి సంబంధాలు ఏర్పాటు చేయాలని తద్వారా విద్యార్థులు వారి సందేహాలను వెంటనే పరిష్కరించుకోగలరని చెప్పారు. ప్రతి విద్యార్థి మంచి ప్రామాణికతతో మార్కులు సాధించడమే కాకుండా ఉన్నత విద్యలో ఆసక్తితో చేరాలని, అక్కడ కూడా మెరుగైన ప్రమాణాలతో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్య అనంతరం వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకొనేలా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేశారు. ఉన్నత ఉద్యోగ, వ్యాపార అవకాశాలను గూర్చి విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించాలన్నారు. ఆయా రంగాల్లో అవకాశాలు స్పష్టంగా తెలియజేయడం వల్ల ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్లొచ్చని సూచించారు. ఇతర దేశాలకు సైతం వెళ్లి విద్యను అభ్యసించేందుకు అవకాశాలను తెలియజేయాలని పేర్కొన్నారు. ఐఐటి, ఐఐఎం, క్లాట్ తదితర జాతీయస్థాయి విద్యా సంస్థల ప్రవేశాల వివరాలను కూడా వారికి తెలియజేసి అందులో ఏ విధంగా ప్రవేశం పొందవచ్చునని తెలియజేయాలని అన్నారు. ప్రతి విద్యార్థి ఇప్పటి నుండే పక్కాగా ప్రణాళిక బద్ధంగా చదవడం ద్వారా ఉన్నత భవిష్యత్తు అందుకోగలరని చెప్పారు. జిల్లా గత రెండేళ్లుగా రాష్ట్రంలోనే పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని అదే స్థానాన్ని నిలుపుటకు ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయుల కృషితో సులభంగా సాధించగలమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

గంజాయి రవాణా అడ్డుకట్టకు సహకరించాలి

ప్రజాశక్తి - సాలూరు

గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు సహకరించాలని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు కోరారు. సోమవారం స్థానిక లారీ యజమానుల సంఘం నాయకులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా లారీ డ్రైవర్లు, క్లీనర్లు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు గొర్లి మధుసూదనరావు, కార్యదర్శి ఇండుపూరి నారాయణరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ కోరారు. గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో మెరుగైన వైద్య సేవలందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా సబ్‌సెంటర్ల వద్ద మలేరియా మందులు లేకపోవడంతో గిరిజనులు వైద్యం కోసం దూరప్రాంతాల్లో గల పిహెచ్‌సిలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ముందస్తుగా వైద్య సేవలందిస్తే వ్యాధుల వ్యాప్తికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

జ్వర మరణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలి : సిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని, ఇటీవల జ్వరాల బారినపడి మరణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని గిరిజన గ్రామలైన బొడ్లగూడ, డోకులజమ్మూ, దొరజమ్మూ తదితర గ్రామాల్లో సోమవారం సిపిఎం బృందం సోమవారం పర్యటించింది. జ్వరాలతో బాధపడుతున్న పత్తిక బలరాం (65), పువ్వలదొర (60), జీలకర్ర అరుణ్ కుమార్ (7), నిమ్మక వివిరి (60) తదితర ఎనిమిది కుటుంబాల ఇళ్లకు వెళ్లి మంచాలపై ఉన్న వారిని సిపిఎం నాయకులు పరామర్శించారు. ప్రభుత్వాస్పత్రికి వెళ్లిన సరైన మందులు, వైద్య సౌకర్యాలు లేవని బాధితులు తెలిపారు. దీంతో విధిలేక అప్పులు చేసి ప్రైవేటు వైద్యాన్ని, నాటు వైద్యం చేయించుకున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ కారణంతో అనేకమంది మరణిస్తున్నారని తెలిపారు. గతంలో మలేరియా వైద్యం చేయించుకుంటూ గుమ్మలో, ఇటీవల జియ్యమ్మవలస మండలంలోని బట్ల భద్రలో తల్లి కూతురు చనిపోవడం విషయం విదితమే. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ మృతులకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, తదితర చోట్ల ప్రవేట్ హాస్పటిల్లో వైద్యం చేయించారని, వైద్యం జాప్యం కారణంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు ఎక్కువయ్యాయని అన్నారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం, శ్రీకాకుళం తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని బాధిత కుటుంబాలు బాధపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిహెచ్‌సిల్లో అందుతున్న వైద్యం, జ్వరాలు, మరణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ వైద్యం సక్రమంగా అందకపోవడం వల్ల ఏజెన్సీలో ప్రజలు ప్రైవేట్ వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అనేక మంది గిరిజనులు బయట ప్రపంచానికి తెలియకుండా చనిపోతున్నారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని అన్నారు. ఇప్పటికైనా అన్ని గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రజలకు అందుబాటులో పిహెచ్‌సిలు, హెల్త్ సబ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, గిరిజన మండలాల్లో దూర ప్రాంతాలను కలిపిన గ్రామాలను దగ్గర పిహెచ్‌సిల్లో విలీనం చేయాలని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని, ప్రభుత్వ హస్పటిల్‌లో మందులు, టెస్ట్‌లు అందుబాటులో ఉంచాలని, పార్వతీపురంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాలు పూర్తి చేయాలని, కురుపాం హాస్పటల్‌ను సూపర్ స్పెషాలిటీగా మార్చాలని, గుమ్మలక్ష్మీపురం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏరియా హాస్పటిల్‌గా వంద పడకల హాస్పటిల్ చేయాలని డిమాండ్ చేశారు. కురుపాంలో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయాలని, బ్లడ్ బ్యాంక్‌ను ప్లేట్ లెట్స్ కురుపాంలోనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పరిశీలనలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు మండంగి శ్రీనివాసరావు, వెంకట్రావులు, నిమ్మక కూర్మారావు మండంగి రామ్మూర్తి ఉన్నారు.



రోగిని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు



ఎమ్మెల్యే జయకృష్ణను సన్మానిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

ఆదివాసీలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

ఆదివాసీలకు అండగా ఉండి, వారి అభివృద్ధికి కృషి చేస్తానని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సామాజిక భవనంలో ఎమ్మెల్యే ఆత్మీయ సన్మాన సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని, అలాగే గిరిజన చట్టాలను రక్షించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి, గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అలాగే ఆదివాసీ ప్రాంతాలకు కనీస వసతుల కల్పనకు రహదారులు, ఇళ్లు, మంచినీరు పూర్తి స్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను ప్రతి ఆదివాసీకి అందేలా చూస్తానని తెలిపారు. గిరిజనులకు అండగా ఉంటామన్నారు. గిరిజనులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం పాటుపడతామన్నారు. కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర నాయకులు బి.తేజేశ్వరరావు, కాంతారావు, అప్పన్న, హెచ్.ప్రసాద్, సవరతోటమొ లింగం, బి.సత్యారావు, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆరిక భాస్కరరావు, పాలక నారాయడు, కొండగొర్రె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాదీ పసుపు విత్తనాలు ఒట్టి మాటే

ట్రైకార్ నిర్లక్ష్యంతో టెండర్లలో జాప్యం : ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో పసుపుకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. ఈ ప్రాంత గిరిజనులకు ముఖ్య ఆదాయ వనరుల్లో పసుపు ఒకటిగా చెప్పవచ్చు. ఇక్కడ పసుపు ఎటువంటి రసాయనాల్లేకుండా ప్రకృతి సిద్ధంతో తయారు చేస్తారు. రంగు ఛాయ, గుమగుమలాడే సువాసన ఈ పసుపు ప్రత్యేకం. అయితే ప్రతి ఏటా ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు విత్తనాలు మే, జూన్‌లో పంపిణీ చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు కావస్తున్నా ఇంతవరకు పసుపు విత్తనాలు పంపిణీ చేయలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 7,300 మంది రైతులు 3,600 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కనీసం విత్తనాలు కూడా ఉద్యాన శాఖ కార్యాలయానికి చేరుకోలేదు. అధికారులు మాత్రం ఇప్పటికే 700 మెట్రిక్ టన్నుల పసుపు విత్తనాలకు ప్రతిపాదనలు పంపించారు. ట్రైకార్ నిర్లక్ష్యం వల్ల టెండర్లుకు పిలవకపోవడం జాప్యం జరిగినట్టు సమాచారం. దీంతో ఈ ఏడాది విత్తనాలు సరఫరా చేయనట్లుగా కనిపిస్తుంది. ఈ సీజన్లో పసుపు ఏపుగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ విత్తనాలందక రైతులు నిరాశతో ఎదురుచూస్తున్నారు. ట్రైకార్ నిర్వాకం వల్ల ఈ ఏడాది పసుపు రైతుల ఆదాయానికి గండి పడింది.



సీతంపేట ఏజెన్సీలో సాగవుతున్న పసుపు పంట

గత సెప్టెంబర్ లో ప్రతిపాదనలు పంపించాం

గతేడాది సెప్టెంబర్‌లో ప్రగతి రోమన్ 8.29 అనే పసుపు 700 మెట్రిక్ టన్నుల విత్తనాలకు ప్రతిపాదనలు పంపించాం. టార్పన్లు 2వేలు, బాలేష్ 100, క్లాస్ క్రయిడ్స్ 30వేలు, పాలిసెర్స్ 200, బ్యాటరీ స్ప్రేయర్లు 1000కి ప్రతి పాదనలు పంపించాం. వీటికి సీతంపేట ఐటిడిఎకు రూ.7 కోట్ల 93 లక్షలు మంజూర య్యాయి. ఇంకా ట్రైకార్ టెండర్లు నిర్వహించలేదు.



ఎస్‌వి గణేష్, పిహెచ్ఒ ప్రాజెక్ట్ అర్టికల్చర్ అధికారి, ఐటిడిఎ, సీతంపేట

సకాలంలో విత్తనాలు సరఫరా చేయాలి



పసుపు విత్తనాలు సకాలంలో సరఫరా చేయాలి. అధికారులు ముందుగానే విత్తనాలు ఐటిడిఎకు రాబట్టుకోవాలి. విత్తనాలు అందక పసుపు వల్ల ఈ ఏడాది రైతులు ఆదాయం కోల్పోవల్సిందే.

నిమ్మక నారాయణరావు, గిరిజనుడు, కంబగూడ

నేటి నుంచి పొలం పిలుస్తోంది...

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ప్రతిరోజూ రెండు రైతు సేవా కేంద్రాల్లో పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. క్షేత్ర సందర్శన కూడా చేస్తారని, శాస్త్రవేత్తలు పాల్గొంటారని ఆమె తెలిపారు.

సవర భాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

సవర భాష వాలంటీర్లను వెంటనే రెన్యువల్ చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని కొండలేవిడి వద్ద గల రబ్బర్ తోట వద్ద సవర భాష వాలంటరీ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశానికి రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవర భాష వాలంటీర్లు గిరిజన విద్యార్థులకు వారికి అర్థమయ్యే భాషలో బోధిస్తున్నటు వంటి వారిని ఇంత వరకు రెన్యువల్ చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే వారికి రెన్యువల్ ఉత్తర్వులు ఇచ్చి మూడు నెలల బకాయి జీతాలు చెల్లించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఐటిడిఎ వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన సవరభాష వాలంటీర్లు పాల్గొన్నారు.



సవరభాష వాలంటీర్లనుద్దేశించి మాట్లాడుతున్న రమేష్


ఆటల పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మహిళా టీచర్లకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - సాలూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు సందర్భంగా సోమవారం స్థానిక లయన్స్ క్లబ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో మహిళా ఉపాధ్యాయుల నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను యుటిఎఫ్ సీనియర్ నాయకులు అప్పారావు రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. మ్యూజికల్ చైర్, పాటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు అంబటి సీతయ్య, కార్యదర్శి కె.జానకీరావు, గౌరవాధ్యక్షులు సింహాచలం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాజమణి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టకపోతే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టకపోతే ప్రజలతో కలిసి ఉద్యమానికి సిద్ధమౌతామని పట్టణ పౌరుల సంఘం కన్వీనర్ దావాల రమణారావు హెచ్చరించారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంలో పాలకులు, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో నగర పంచాయతీ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. నగర పంచాయతీ కార్యాలయం ముందు చెత్త వేయడం పట్ల స్థానికులు వ్యతిరేకిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్న పాలకులు దీన్ని పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో లేదన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.


కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను బయటకు తీస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలతో పాటు 30 వార్డుల్లో ఉన్న కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి అనడానికి నిదర్శనం. కూటమి ప్రభుత్వ హయాంలో పట్టణంలో ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతున్న సందర్భంలో పట్టణంలో పెద్ద, చిన్న కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. అందులో భాగంగా పట్టణంలో ఇటీవల గత కొన్ని రోజుల నుంచి పట్టణంలో ఉన్న కాలువల్లో పేరుకుపోయిన పూడికలను సిబ్బంది తొలగిస్తున్న సందర్భంలో ఏ కాలువలో చూసినా ప్లాస్టిక్ ఖాళీ సీసాలు, వ్యర్థాలు దర్శనం ఇవ్వడంతో, ఈ వ్యర్థాల కారణంగానే ప్రధాన కాలువల్లో మురుగు, వర్షపునీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతుందని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నేవీ మాజీ ఉద్యోగులు

నిరుద్యోగ గిరిజన యువతకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో బియ్యాల వలస పంచాయతీ దురిబిలిలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న గిరిజన యువతకు ఎస్ సొసైటీ అధ్యక్షులు షేక్ గౌస్ ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నానికి చెందిన మాజీ నేవీ ఉద్యోగులు షేక్ సిరాజుద్దీన్, విబిఎన్ ప్రతాప్, నగేష్, గంగాధర్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దురిబిల్లికి చెందిన గిరిజన యువత పలు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 53 మందికి పుస్తకాలు అందజేస్తామని,వీరంతా బిఇడి, టిటిసి, డిగ్రీ, ఇంటర్, డిప్లమా ఆపై చదువులు చదువుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారని అన్నారు. ఈ విషయాన్ని స్థానికంగా పని చేస్తున్న ఎస్ సొసైటీ ద్వారా తెలుసుకుని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. ఈ మెటీరియల్ సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో ప్రతిభ సాధించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పువ్వల అజ్జరి, మాజీ సర్పంచ్ పువ్వల పత్తి, గ్రామ పెద్దలు నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలకు రక్షణ కరువు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో అడవి ఏనుగుల సంచారంతో ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైందని గిరిజన సంఘం నాయకులు పల్లా సురేష్ అన్నారు. మండలం వన్నంలో అడవి ఏనుగులు రైతును తొక్కి చంపడం అత్యంత బాధాకరమన్నారు. ఏనుగుల సంచారంతో రైతులు స్వేచ్ఛగా పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. రాత్రివేళ ఏ గ్రామంలో ఇళ్లపై దాడి చేస్తాయోనని ప్రజలు క్షణక్షణం కంటిమీద కునుకులేకుండా కాలం గడుపుతున్నారని అన్నారు. అడవి ఏనుగుల బారి నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

మాజీ వైస్ ఎంపిపి మాలతీ దొర మృతి

ప్రజాశక్తి - సాలూరు


మాలతీదొరకు నివాళ్లు అర్పిస్తున్న భంజ్‌దేవ్

మండల మాజీ వైస్ ఎంపిపి మాలతీదొర సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి ఆయన పార్టీలో ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పట్టున్న గిరిజన నాయకునిగా ఆయనకు గుర్తింపు వుంది. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్, టిడిపి మండల సీనియర్ నాయకులు చోడవరపు గోవిందరావు మాలతీదొర మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్వతీపురం మండలం డోకిశిలలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని శ్రీ వెంకట విద్యా గిరి పాఠశాలలో సోమవారం కృష్ణాష్టమి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయిశ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కృష్ణుడు, గోపికల వేషధారణలు వేయించి ఆడించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేటలో యువత, మహిళలు ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. ఉదయం నుంచి చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించి సందడి చేశారు. మారుమూల గ్రామాల్లో సైతం ప్రజలు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకున్నారు.

జియ్యమ్మవలస: కృష్ణాష్టమి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా పెదమేరంగి కూడలిలో గల తిరుమల సాయి హైస్కూల్ విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం ప్రత్యేకతను చాటుకున్నారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకునేలా నృత్యాలు చేస్తూ రాధాకృష్ణుల గేయాలతో వెన్నముద్దతో ఉన్న ఉట్టిని కొడుతూ ఈ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి, న్యాయ సలహాదారు రౌతు వెంకటరమణ, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలో మామిడిపల్లి, బాగువలస, శివరాంపురం, తోణాం, కురుకుట్టి, కందులపదం, కొత్తవలస, జీగిరాం, పెద పదం, అన్నం రాజువలస గ్రామాలలో పిల్లలు గోపిక, కృష్ణుడు రూపాల్లో ముస్తాబై శ్రీ కృష్ణాజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


జియ్యమ్మవలస : కృష్ణుడి వేషధారణలో ఉన్న విద్యార్థులు


సాలూరురూరల్ : ఉట్టికొట్టేందుకు ప్రయత్నిస్తున్న యువకులు


మృతునికి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సేవా భావం.. ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంచి మనసున్న మనిషిగా, సేవా భావం కలిగిన ప్రజాప్రతినిధిగా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. తన తొలి వేతనాన్ని పేద ప్రజలకు, సామాజిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే పార్వతీపురానికి చెందిన కె.రామ్మోహనరావు గుండెపోటుతో మృతి చెందారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో కొంత నగదు ఆర్థిక సహాయంగా అందించి ఉదారభావం చాటుకున్నారు. పిల్లల చదువులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పిల్లల చదువులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తోటపల్లి దేవస్థానానికి కొంత నగదు విరాళంగా ఇచ్చారు. మిగిలిన సొమ్మును సేవా కార్యక్రమాలకు వినియోగిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కళావతి, లోవ రాజు ఉన్నారు.

వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

రహదారి భద్రతపై వాహనదారులకు స్థానిక ఎస్ఐ ఎం.రాజేష్ సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి... హెల్మెట్ ధరించడం వల్ల మీ ప్రాణం పోకున్నా 98శాతం కాపాడుతుందని... మన శరీరంలో ఏ భాగం పోయినా అతుకుతుంది కానీ తలకు దెబ్బలు తగిలి ప్రాణాలు పోయే పరిస్థితి రాదని, కావున ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. అలాగే సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా ఉండాలన్నారు. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాహనదారులతో పాటు సీతానగరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : మండల కేంద్రమైన కురుపాంలో హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనదారులకు సోమవారం స్థానిక ఎస్సై షణ్ముఖరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ వాడడం వలన ప్రమాదాలు జరిగినప్పుడు తలకు, ముఖానికి ఎటువంటి దెబ్బలు తగలకుండా ఉంటే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. మనిషికి అన్నిటికన్నా ముఖ్యమైంది తల అని, కావున ప్రతి వాహనదారుడు హెల్మెట్ వాడి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


సీతానగరంలో వాహనచోదకులు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీపై విచారణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు వివిధ రోగాలు పేరుతో ప్రజలను భయాందోళనకు గురిచేసి లక్షలాది రూపాయలు దోచుకుంటున్న తీరుపై కలెక్టర్ విచారణకు ఆదేశాలు జారీచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్ అన్నారు. జియ్యమ్మవలస మండలంలోని బట్లభద్రలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి కూతుళ్లు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో తల్లీకూతుళ్ళు వారంరోజులపాటు చికిత్స పొంది చివరలో రిఫరల్ చేయగా శ్రీకాకుళం, విజయనగరం తరలించి మరణానికి కారణమైన ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో చాలా ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ తెల్లకార్డు ఉన్న వారి నుంచి ఆసుపత్రిలో జాయిన్ అయిన దగ్గర నుంచి ఫీజులు, టెస్టుల పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేయడంపై విచారణ చేయాలన్నారు. బట్లబద్రలోజరిగిన తల్లీ కూతుర్ల మరణానికి కారణమైన ఆసుపత్రి వైద్యుల పైన, దీనికి కారణమైన ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు.

రోడ్లు వేయాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లుంబేసు పంచాయతీ పరిధిలో గల వామాసి, దేరుగండ కొండల శిఖర గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ ప్రజలు కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరికి సోమవారం వినతి పత్రం అందించారు. తమ గ్రామాలకు రహదారి సౌకర్యం లేక ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నామన్నారు. అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందడం లేదని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. తాము పండించిన అటవీ ఫలాలను మైదాన ప్రాంతానికి తీసుకురావడానికి, వైద్యానికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యను విన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వామాసి, దేరుగండ గ్రామాలకు రహదారి నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపిస్తానని, రోడ్డు నిర్మాణాలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జమ్మయ్య, కామేష్ రెండు గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

కాలనీల వీధి పేర్లతో బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలో ఉన్న కాలనీ, వీధి పేర్లతో బోర్డులను సోమవారం సర్పంచ్ జి. సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేజర్ పంచాయతీలో అన్ని కాలనీలకు, వీధులకు పేర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అంతేకాక గ్రామంలో పారిశుధ్యం లోపం, తాగునీటి సమస్య లేకుండా ప్రజలకు అందిస్తున్నామని ఇంకా ఎక్కడ ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని అన్నారు.

జిల్లేడు కషాయం... పోషకాల మయం

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లేడు మొక్కలో ఉన్న పాల వంటి చిక్కటి లేటెక్స్ ద్రావణంలో అనేక రకాల పోషకాలు ఉంటాయని, దీంతో ఎలాంటి ఖర్చు లేకుండా పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలను అందించవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కర్రివలసలో ఎపిసిఎన్ఎఫ్‌సిఆర్‌పి చప్ప నరసింహమూర్తి సూచనలతో రైతు లండ నారాయణ రావు 200 లీటర్ల జిల్లేడు కషాయాన్ని తయారు చేశారు. నవధాన్యాలు వేసుకుని జిల్లేడు కషాయం ద్రవ జీవామృతం రెండు, మూడు సార్లు వేసుకుంటే ఎలాంటి ఎరువులు వేసుకోకుండానే సరియైన పంట దిగుబడి వస్తుందని రైతు నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రకృతి సేద్యానికి నవధాన్యాలు మొదటి మెట్టని తదుపరి బీజామృతశుద్ధి, జీవామృతాలు అవసరాన్ని బట్టి కషాయాలు పిచికారీ చేసుకుంటే ఎలాంటి ఖర్చు లేకుండా పర్యావరణానికి హాని జరగకుండా ఆరోగ్యవంతమైన పంటలను పండించవచ్చని తెలిపారు.

పక్షిస్తావరాలు, జిగురు అట్టల ఏర్పాటు

అనంతరం వరి పొలంలో పక్షిస్తావరాలు, జిగురు అట్టలను ఏర్పాటు చేశారు. జిగురు అట్టలు రసం పీల్చు పురుగులైన దోమపోటు తామర పురుగుల ఉనికిని తెలుసుకోవడానికి పంట ఆకులను తినే గొంగళి పురుగులను నివారించడానికి పక్షిస్తావరాలు ఉపయోగపడతాయని ఎలాంటి ఖర్చులు లేనటువంటి ఈ పద్ధతులను రైతులు ఆచరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసిఆర్ పి.సుహాసిని, రైతులు పాల్గొన్నారు.

పసుపు సాగుపై పొలంబడి

సీతంపేట : మండలంలోని పిపి ఈతమానుగూడ పంచాయతీ ఇప్పగూడలో సవర భారతి పసుపు పంటలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో జీడిమామిడితోటలో పసుపు వేసి రెండు, మూడేళ్లకు పంట తీస్తున్నారు. దీనివల్ల శ్రమ పెరుగుతుందని, పంట దిగుబడి అంతగా రావడం లేదని అన్నారు. దీన్ని అధిగమించేందుకు గానూ బోదెలు వేసి పసుపు విత్తనాలు నాటడం వల్ల ఏడాదికి పంట పొందవచ్చన్నారు. ఈ పంటకు ద్రవ, ఘనజీవామృతం, వేప పిండి వేసి పంట దిగుబడి అధికంగా పొందవచ్చని తెలిపారు. ఇందులో అంతర్ పంటలు కూరగాయలు వేసి ఫలసాయం పొందవచ్చని పొలం బడి రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరరావు వివరించారు. అలాగే తెగుళ్ళ, పురుగులు రాకుండా కలుపు తీయాలని, కషాయాలు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం పిచికారీ చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పసుపు పంటలో బీరకాయ, బెండకాయ, కాకరకాయ, చిక్కుడు సాగును పరిశీలించారు. ఈ పంటపై ద్రవజీవామృతం ఉపయోగించేందుకు డెమో తయారీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు, వెలుగు అసోసియేషన్ కార్యకర్తలు శంకర్, రామారావు, జగ్గయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

పొలం గట్లపై కాయగూరల సాగుతో అదనపు ఆదాయం

గరుగుబిల్లి : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పొలం గట్లపై పలు రకాల కాయ గూరల పంటలు పండించడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తోందని ప్రకృతి వ్యవసాయం మెంటర్ మరడాన అప్పలనాయుడు తెలిపారు. మండల పరిధిలోని నందివానివలస తదితర గ్రామాల్లో సోమవారం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలం గట్లపై పలు రకాల పంటలు పండించేలా అవగాహన కల్పించారు. ఈ మేరకు పొలం గట్లపై అదనపు ఆదాయం వచ్చే మునగ, అరటి, బొప్పాయి, జామ, కరివేపాకుతో పాటు చిక్కుడు, వంగ, మిరప, తదితర కాయగూరలు పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించారు.


పాచిపెంట : ఇల్లేడి కషాయంతో లెటెక్స్ ద్రావణాన్ని తయారు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

లక్ష్యాలు సాధించే మార్గాలపై అవగాహన

ప్రజాశక్తి - భామిని

ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకుని, ఆ లక్ష్య సాధనకు అవకాశాలు, సాధించే మార్గాలపై అవగాహన ఉంటే త్వరగా లక్ష్యం సాధించగలరని హెూలీ క్రాస్ డైరెక్టర్ కె.ప్రభుదాస్ అన్నారు. మండలంలోని సింగిడిలో హెూలీ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు లక్ష్యాలు సాధించే మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఒక డాక్టర్, లాయర్, కలెక్టర్, పోలీస్, బ్యాంకు అధికారి, లోకో పైలట్, ఇంజనీర్, ఉపాధ్యాయరాలు కావాలంటే ఏం చదవాలి, ఏ మార్గం ఎంచుకుంటే ఆ లక్ష్యం సాధిస్తావు అనే అంశాలు విద్యార్థినులు బృందాలుగా వివరించారు. అనంతరం పిల్లలకు విభిన్న ఆటలు ఆడించి, భావ వ్యక్తీకరణ, జీవన శైలి అనే అంశాలు వివరించారు. కార్యక్రమంలో హెూలీ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్, కలెక్టర్, పోలీస్ వేషాదారణలో ఉన్న విద్యార్థులు

స్ఫూర్తి ప్రదాత పివిజి

ప్రజాశక్తి-విజయనగరం కోట

భావి తరాలకు, ప్రస్తుత తరానికి స్ఫూర్తి కలిగించిన మాజీ ఎంపి డాక్టర్ పివిజి రాజు సమాజానికి విశిష్ట సేవలు అందించారని పలువురు వక్తలు కొనియాడారు. ఆ మహనీయుని జీవిత చరిత్ర అందరికీ తెలియాల్సిన అవసరం వుందని అన్నారు. పివిజి రాజు శత జయంతి ఉత్సవాల సందర్భంగా మాన్సాస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కోటలో నిర్వహించిన కార్యక్రమం లో పివిజి రాజు జీవిత విశేషాలు, ఆయన చేసిన సేవలపై ఆయన కుమారుడు, కేంద్ర మాజీమంత్రి పి.అశోక్‌గజపతిరాజు ముద్రించిన పుస్తకాన్ని పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సమాజం కోసం తన సంపద నంతటినీ ధారపోసిన గొప్ప వ్యక్తి పివిజి రాజు అన్నారు. రాబోయే తరం వారి చదువుల కోసం తన కోటను చిన్న వయసులోనే దానం చేసిన వ్యక్తని కొనాయడారు. రాజరిక భోగాలను విడిచిపెట్టి రాజకీయాల్లో సాధారణ వ్యక్తిగా కొనసాగిన నాయకుడు అని చెప్పారు. ఆయన ఎందరికో విద్యాదానం చేసిన మహోన్నత వ్యక్తి మాత్రమే కాదని, మానవతా వాది అని చెప్పారు. కోరుకొండ సైనిక్ స్కూల్ ఆయన చొరవ వల్లే ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యిందని చెప్పారు. సమాజానికి చేసిన విశిష్ట సేవలను ఒకే చోటికి తీసుకురావడంలో వారు చేసిన కృషికి సంతోషాన్ని వ్యక్తపరిచారు. కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ విద్యను పెంపొందిం చడం ద్వారా వెనుకబాటు తనాన్ని నిర్మూలించవచ్చని పివిజి రాజు నిరూపించారని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఉత్తరాంధ్రలో విద్యావకాశాలు పెంపొందించి వెనుకబాటు తనం పోగొట్టే దిశగా కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. నేటి తరం ప్రజా ప్రతినిధులు అంతా కలిసి పనిచేసి ఆయన ఆశయాలు ముందుకు నడిపిస్తామని చెప్పారు. వ్యవసాయశాఖా మంత్రి కె.అచ్చె న్నాయుడు మాట్లాడుతూ డా.పి.వి.జి. ఆశయాలను అశోక్ గజపతిరాజు ముందుకు తీసుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. పజా జీవితంలో ఎన్ని పదవులు అనుభవించినా భేషజాలు లేకుండా సాధారణ వ్యక్తిగా పివిజి వ్యవహరించారనిమాజీ స్పీకర్ ప్రతిభా భారతి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, అనకాపల్లి ఎం.పి. సి.ఎం.రమేష్, విశాఖపట్నం ఎం.పి. శ్రీభరత్, తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.పి. కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఉత్తరాంధ్ర జిల్లాల శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, విజయనగరం ఎస్ పి. వకుల్ జిందాల్, ఉత్తరాంధ్ర జిల్లాల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 300 మంది సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున రూ.15 లక్షలు స్కాలర్ షిప్ మొత్తాని ప్రముఖులు చేతుల మీదుగా అందజేశారు. పుస్తక ప్రచురణ కర్త అయిన హైదరాబాద్ బుక్ ట్రస్ట్ అధ్యక్షురాలు గీతా రామస్వామిని సత్కరించారు. అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పివిజి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని 300 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందజేయ నున్నట్టు చెప్పారు.


మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం


విద్యుత్‌షాక్ గురై మృతి చెందిన సత్యంనాయుడు

మండలంలోని తలవరం గ్రామానికి చెందిన వావిలపల్లి సత్యం నాయుడు (61) ఈ నెల 25వ తేదీన విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ మేరకు గ్రామస్తులు, పోలీసులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 25న ఉదయం 10 గంటలకు సత్యంనాయుడు పొలం పనులు చూసుకునేందుకు వెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో భయపడి భార్య గ్రామంలో ఉన్న రైతులందరికీ తన భర్త ఆచూకీ కోసం ఆరా తీసింది. వీరి పొలాలకు సమీపంలో ఉన్న వావిలపల్లి గౌరీశ్వరికి ఫోన్ చేసి తన భర్త ఇంటికి రాలేదని, ఆచూకీ చూడమని సమాచారం ఇచ్చింది. దీంతో వారు సత్యంనాయుడు పొలానికి వెళ్లి చూడగా చెంపపై గాయం, చెవుల నుంచి రక్తం కారడం చూసి విద్యుత్ షాకుకు గురై మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే సత్యంనాయుడు భార్యకు, పోలీసులకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కళాధర్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. సత్యంనాయుడుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మద్యం మత్తులో సోమవారం ఒక వ్యక్తి మతి చెందాడు. గజపతినగరం మండలం భూదేవిపేటకు చెందిన బక్క తులసి (41) కొద్దిరోజుల క్రితం పట్టణానికి వచ్చి ఎక్కువగా మద్యం సేవించి పడిపోవడం, వర్షంలో తడిసి పోవడంతో మృతి చెందినట్లు టౌన్ ఎస్ఐ కెవి సీతారాములు చెప్పారు. తులసి కుటుంబం విశాఖపట్నంలో ఉన్నట్టు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


మృతి చెందిన తులసి